క్లుప్తంగా

సీనియర్ అసిస్టెంట్ సేవలు మరువలేనివి



నాగరాజును సన్మానిస్తున్న ఎస్పీ రత్న, సిబ్బంది

పుట్టపర్తి టౌన్: డీపీఓ సీనియర్ అసిస్టెంట్ నాగరాజు సేవలు మరువలేనివని ఎస్పీ రత్న పేర్కొన్నారు. నాగరాజు ఉద్యోగ విరమణ చేయడంతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ సిబ్బంది ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఎస్పీ హాజరై సిబ్బందితో కలసి నాగరాజును శాలువా, పూల మాలలతో సత్కరించి మెమొంటో అందజేశారు. ఈసందర్భంగా ఎస్పీ నాగరాజు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఓ సుజాత, సూపరెండెంట్‌లు మల్లిఖార్జున, సరస్వతి, ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసులు, ఆర్‌ఐలు మహేష్, వలి, సీసీ చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతి లేనిదే లేఅవుట్లు ఏర్పాటు చేయొద్దు

గాండ్లపెంట: ఎన్పీకుంట సమీపంలో అనుమతులు లేకుండా లే అవుట్లు వేయరాదని తహసీల్దార్ దేవేంద్ర తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో కొంత మంది రియల్‌ఎస్టేట్ వ్యాపారులు లేఅవుట్లు వేస్తున్నారని తెలుసుకున్న అధికారులు కార్యాలయానికి పిలిపించారు. అదే సమయంలో వార్తా సేకరణ కోసం వెళ్లిన విలేకరులను చూసిన వ్యాపారులు వారిని అసభ్య పదజాలంతో దూషించారు. ఈ విషయంపై స్థానిక విలేకరులు, ఏపీయూడబ్ల్యూజే నేతలు వ్యాపారులపై ఎస్ఐ వలీబాషాకు ఫిర్యాదు చేశారు.

ఉపాధ్యాయులకు ఆత్మీయ సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

కనగానపల్లి: మండలంలోని చంద్రాచెర్ల ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు స్థానిక గ్రామస్తులు, ఉపాధ్యాయులు వీడ్కోలు పలికారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు పుల్లప్ప, భ్రమరాంబ, హైదర్‌వలికి శాలువాలు, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యాభివృద్ధికి వారు చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగసురేష్ బాబు, సుధాకర్, బాబు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామానాయక్

తనకల్లు: ప్రతి ఒక్కరూ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ సయ్యద్ షాబుద్దీన్, ఎంపీడీఓ రామానాయక్ అన్నారు. కొర్తికోటలో గురువారం సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి కొన్ని హక్కులతో పాటు బాధ్యతలను కల్పించిందన్నారు. గ్రామాల్లో కక్షలకు తావులేకుండా ప్రజలు కలిసి మెలిసి జీవించాలని ఎస్ఐ గోపి తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ, వీఆర్వో మనోహర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వర ఆలయంలో చోరీ



బంగారు ఆభరణాలు లేని అమ్మవారి విగ్రహం

బత్తలపల్లి: డి.చెర్లోపల్లి గ్రామ సమీపంలోని సిద్ధేశ్వర ఆలయంలో బుధవారం రాత్రి బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. పోలీసు తెలిపిన వివరాలు..డి.చెర్లోపల్లి సమీపంలోని సిద్ధేశ్వర ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని పార్వతీదేవి అమ్మవారి మూలవిరాట్‌ను రెండు తులాల బంగారు చైను, రెండు తులాల బంగారు నల్ల పూసలు దండ, రెండు తులాల వెండి నాగపడగను అలంకరించారు. వీటిని బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుని వెళ్లారు. ఆలయ పూజారి పవన్‌కుమార్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దోచుకునోళ్లకు దోచుకున్నంత!

- ఉపాధిహామీలో పెచ్చుమీరిన అక్రమాలు
- అందినకాడికి మేసేస్తున్న సిబ్బంది
- పనులకు వెళ్లకుండానే కూలి
- దొంగ మస్టర్లతో జేబులు నింపుకుంటున్న ఫీల్డ్ అసిస్టెంట్లు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ధర్మవరం రూరల్: ఉపాధి హామీ పథకంలో అక్రమాలు పెచ్చుమీరాయి. కూలీలకు ఉపాధి కల్పించడం ఏమో కాని సిబ్బంది మాత్రం అందిన కాడికి దోచుకు తింటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దొంగ మస్టర్లతో ఫీల్డ్ అసిస్టెంట్లు జేబులు నింపుకుంటున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు క్షేత్ర స్థాయి వెళ్లకపోవడంతో సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాట తయారైనట్లు చర్చ జరుగుతోంది. టీఏలకు ఇవ్వాల్సిన వాటాలు అందుతుండడంతో వారు క్షేత్రస్థాయికి వెళ్లడం లేదని తెలుస్తోంది.

రాత్రికి రాత్రే జేసీబీలతో పనులు

ఉపాధి పనులను యంత్రాలతో చేయకుండా కేవలం కూలీలతో మాత్రమే పనులు చేయించాలని నిబంధన ఉన్నాయి. అయితే రాత్రికి రాత్రే యంత్రాలతో పనులు చేసి ఉదయం పని వద్దకు కొంత మందిని తీసుకెళ్లి ఫొటోలను తీసుకుంటున్నట్లు సమాచారం. ఫీల్డ్ అసిస్టెంట్లు మస్టర్లు వేసుకొని సొమ్మును దోచుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. కాగా గతంలో చేసిన పనులను కూడా ప్రస్తుతం కొత్త వాటిగా చూపుతూ బిల్లులు పెడుతున్నట్లు తెలుస్తోంది.

ధనవంతులకే ఉపాధి కూలి డబ్బు

ఉదయం లేచి చాలా మంది పేద కూలీలు పలుగు, పార చేత పట్టుకొని కిలోమీటర్ల దూరం నడిచి అక్కడ ఉపాధి పనులు చేస్తున్నారు. అయితే వీరు చేసిన పనికి ఇళ్ల వద్ద ఉంటున్న కొంత మంది ధనవంతులకు కూడా వీరి కూలి డబ్బులు పడుతున్నాయని పేద కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడో పట్టణాలలో ఉంటున్న ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, మున్సిపల్ ఉద్యోగులకు కూడా మేము చేసిన పనులకు దొంగ మస్టర్లను సృష్టించి వారికి బిల్లులు పెడుతున్నారని పేద కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటాం

ఉపాధి పనులను కేవలం కూలీలతో మాత్రమే చేయించాలి. యంత్రాలతో పనులు చేయించినట్లు విచారణలో తేలితే వారిపై చర్యలు తీసుకుంటాం. పనులకు రాని వారి పేర్లను మస్టర్‌లో నమోదు చేసుకొని బిల్లులు స్వాహా చేస్తున్నట్లు మా విచారణలో తెలితే అలాంటి వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటాం.

– విజయ్ ప్రసాద్, డ్వామా పీడీ

అక్రమాల్లో మచ్చుకు కొన్ని..

- సుబ్బరావుపేట గ్రామానికి చెందిన బాల సంజీవరాయుడు రైల్వే కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. అయితే ఉపాధి పనులకు వెళ్లినట్లు మస్టర్(జాబ్ కార్డు నెంబర్ 10521)లో పేర్లు నమోదు చేసుకొని బిల్లులను స్వాహా చేస్తున్నారు.
- ధర్మవరం మున్సిపల్ కార్యాలయంలో విధులను నిర్వహిస్తున్న రవి, పెద్దక్క దంపతులు (జాబ్ కార్డు నంబర్ 10234) వీరు కూడా పనులకు వెళ్లకుండా బిల్లులు తీసుకుంటున్నారు.
- ఏకిల చంద్రశేఖర్ (జాబ్ కార్డు నెంబర్ 10524) కుటుంబం గ్రామంలోనే లేదు. అయినా పనులు చేసినట్లు వారం వారం బిల్లులను స్వాహా చేస్తున్నారు.

ప్రజలను నమ్మించి వంచించిన చంద్రబాబు



కదిరిలో క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



ఇనగలూరులో కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

కదిరి టౌన్: ఎన్నికల్లో చంద్రబాబు అబద్ధపు హామీలతో ప్రజలను నమ్మించి వంచించారని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. పట్టణంలోని 24 వార్డులో గురువారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కె.వి ప్రణీత్‌రెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ లింగాల లోకేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో సూపర్‌సిక్స్, బాబు ష్యూరిటీ–భవిష్యత్ గ్యారెంటీ అంటూ ప్రజలను నమ్మించి ఓట్లు దండుకొని పథకాలు ఎగ్గొట్టారన్నారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను సూపర్‌సిక్స్ పథకాలు అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం ఏరులై పారుతోందని, ఒక్కో క్వార్టర్‌పై రూ.30 అదనంగా వసూలు చేస్తున్నారన్నారు. అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకే పింఛన్, ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి.. ఇలా ఏ ఒక్క పథకం అమలు చేసిన పాపాన పోలేదన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కౌన్సిలర్లు షబ్బీర్, రామ్‌ప్రసాద్, ఆవుల స్వామి, అహమ్మద్, నాయకులు పరికి సాధిక్‌బాషా, సలీమ్, రమేష్‌యాదవ్, ఇర్ఫాన్, అమీర్, మహబూబ్ ఖాన్, సమీర్‌ఖాన్ ,బాబా తదితరులు పాల్గొన్నారు.

ఇనగలూరు పంచాయతీలో..

ఓడీచెరువు: ఇనగలూరు, గొల్లపల్లి, గాజుకుంటపల్లిలో గురువారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇచ్చిన హామీల గురించి అడిగితే నాలుక కోస్తామని చంద్రబాబు అనడం వారి అహంకారానికి నిదర్శనమని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మద్దెరాజునాయుడు పేర్కొన్నారు. జెడ్పీటీసీ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్‌లో ఏ ఒక్క పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. నాడు –నేడుతో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిస్తే బాబు సర్కారు వున్న పాఠశాలలను ఎత్తేసే పనిలోపడిందని కన్వీనర్ లక్ష్మీరెడ్డి ప్రభుత్వ తీరును ఎండగట్టారు. సర్పంచ్ బాబా, ఎస్సీ సెల్ రామాంజి, బయపరెడ్డి, వెంకటరెడ్డి, చంద్ర, భాస్కర్‌రెడ్డి, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



పదవీ విరమణ పొందిన శివరంగ ప్రసాద్‌ను సన్మానిస్తున్న అధికారులు

పుట్టపర్తి టౌన్: ప్రతి ఉద్యోగి అంకితా భావంతో పనిచేస్తేనే గుర్తింపు లభిస్తుందని వక్తలు పేర్కొన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి శివరంగ ప్రసాద్ ఉద్యోగ విరమణ చేయడంతో గురువారం బీసీ బాలికల వసతిగృహంలో వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. బీసీ వెల్ ఫేర్ జిల్లా అధికారి రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎస్టీ వెల్ఫేర్ అధికారి మోహన్ రావు, సోషల్ వెల్ఫేర్ అధికారి రెడ్డి బాలాజీ, అసిస్టెంట్ వెల్ఫేర్ అధికారి నరసింహారావు, వార్డెన్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు శివరంగ ప్రసాద్ సేవలను కొనియాడారు. అనంతరం ఆయన్ను ఘనంగ సత్కరించారు.

పుట్టపర్తి: బుక్కపట్నం డైట్ కళాశాలలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ గురువారం ఉద్యోగ విరమణ చేసిన ఫ్రాంక్లిన్ ఫ్రెని తోటి ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వక్తలు ఆయన సేవలను కొనియాడారు. డీఈఓ క్రిష్టప్ప, వైఎస్సార్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, రాష్ట్ర నాయకులు రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: ఆర్డీఓ కార్యాలయ సబ్‌ఆర్డినేటర్లు వెంకట రామయ్య, రహమత్‌బేగం ఉద్యోగ విరమణ చేయడంతో గురువారం వారిని ఆర్డీఓ మహేష్ శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఖతిజున్‌కుబ్రా, ముదిగుబ్బ తహసీల్దార్ నారాయణస్వామి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా లోకేశ్వర్‌రెడ్డి

ధర్మవరం: వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం రాష్ట్ర కమిటీలను వైఎస్సార్‌సీపీ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. వైఎస్సార్‌సీపీ పార్టీ రాష్ట్ర ఐటీ విభాగ కమిటీ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ధర్మవరం నియోజకవర్గానికి చెందిన వి.లోకేశ్వర్‌రెడ్డిని నియమించారు.

రోగులకు అల్పాహారం అందజేత

ధర్మవరం అర్బన్ : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రోగులు, వారి సహాయకులకు అల్పాహారాన్ని అందించారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ తిప్పేంద్రనాయక్ సహకారంతో శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు రోగులు, వారి సహాయకులకు పాలు, బ్రెడ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

ఇంటర్ సీఈసీలో ఖాళీలు

నల్లమాడ: ఆర్. రామాపురం వద్దనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీ గ్రూపులో ఎస్సీ విద్యార్థినులకు సీట్లు ఖాళీ ఉన్నట్లు ప్రిన్సిపాల్ సుధారాణి గురువారం తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పాసైన విద్యార్థినులకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 2వ తేదీ లోపు సంప్రదించాలని కోరారు.

పేకాటస్థావరంపై దాడులు

బత్తలపల్లి: పత్యాపురం గ్రామానికి చెందిన టికె.నాయక్ పొలంలో జూదం ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు గురువారం మెరుపుదాడులు నిర్వహించారు. ఈసందర్భంగా పేకాట ఆడుతున్న మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు పట్టుపడగా, మరో ముగ్గురు పారిపోయినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి రూ.40,820 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సోమశేఖర్ పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

ముదిగుబ్బ ఎంఈఓగా వెంకటాచలపతి



ముదిగుబ్బ: స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓ–1 గా జి. వెంకటాచలపతి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఎంఈఓ–2 వేమనారాయణ, ఉపాధ్యాయులు పక్రుద్దీన్, ఈశ్వరయ్య, రామక్రిష్ణారెడ్డి, సైపుల్లా, శ్రీధర్, నాగేంద్ర, సబ్బీర్, వెంకటేష్ నాయక్, గంగరాజు, ఫరాజ్ శ్రీనివాసులు, నరసింహులు, ఎమ్మార్సీ సిబ్బంది నూతన ఎంఈఓను సత్కరించారు.

కేజీబీవీ వసతిగృహం ప్రారంభం

గాండ్లపెంట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన కేజీబీవీ టైప్–4 బాలికల వసతి గృహాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు క్రమశిక్షణతో మెలిగి ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ప్రసాద్, సర్వశిక్ష ఏపీసీ దేవరాజ్, తహసీల్దార్ బాబురావు, జీసీడీఓ సంపూర్ణ, ఎంఈఓలు కృష్ణానాయక్, శ్రీనివాసులు, గోపాల్‌నాయక్, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించండి



ధర్మవరంలో కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి

ధర్మవరం: గతంలో గడప గడపకు వైఎస్సార్ కార్యక్రమం చేసిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు రూ.5.48 కోట్లను స్థానిక మున్సిపల్ అనుమతుల మేరకే తక్షణం చెల్లించాలని కౌన్సిలర్ యరగుంట భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. అజెండాలోని 14వ అంశంలో ఈ నిధులు చెల్లించడానికి మున్సిపల్ రాష్ట్ర సంచాలకులు అనుమతులు కావాలని పొందుపరచడంపై అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఆ అజెండాలోని అంశాన్ని సవరణ చేస్తూ కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో గురువారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్ చందమూరి నారాయణరెడ్డి మాట్లాడుతూ ఏడాది కాలంగా టెండర్లు పిలుస్తున్నారని ఆ పనులు చేపట్టారా, చేస్తుంటే అవి ఎంత వరకు వచ్చాయన్న సమాచారాన్ని తెలియజేయాలని కోరారు. వార్డుల్లో పారిశుద్ధ్యం, వీధిలైట్లు, పందులు, వీధికుక్కలు తదితర సమస్యలను వార్డుల కౌన్సిలర్లు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు వేముల జయరామిరెడ్డి, షేక్ షంషాద్‌బేగం, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కె.ఎస్.దిల్షాదున్నీషా అధికారులకు సూచించారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. 36వ వార్డులో తాగునీటి సమస్య నెలకొందని, డ్రైనేజీల్లో పూడికతీయాలని కౌన్సిలర్ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ సందీప్, సీనియర్ అసిస్టెంట్ ఆరీఫ్, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశేఖరాచారి,కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



సుధాకర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వెంకటరామిరెడ్డి

పుట్టపర్తి టౌన్: ఎనుములపల్లికి చెందిన సుధాకర్ (53) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి తండ్రి వెంకటరామిరెడ్డి గురువారం సుధాకర్ ఇంటికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళర్పించారు. కుటుంబసభ్యులకు పరామర్శించి ధైర్యం చెప్పారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ రవినాయక్, నాయకులు గోపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డి, రామాంజనేయులు, ఓబుళరెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు. చెర్లోపల్లికి చేరుకుని అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నాగిరెడ్డి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయనతో పాటు నాయకులు తిప్పారెడ్డి, క్రిష్టారెడ్డి, నాగభూషణ తదితరులు ఉన్నారు.

కొత్తచెరువు మండలం యర్రపల్లికి చెందిన తిప్పారెడ్డి నూతన గృహ ప్రవేశానికి హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ రూప్లానాయక్, సింగల్ విండో మాజీ అధ్యక్షులు పోతిరెడ్డి, రఘునాథరెడ్డి, మాజీ సర్పంచ్ నంజిరెడ్డి, నాయకులు నరసింహారెడ్డి, శంకర్‌రెడ్డి, శివారెడ్డి, యోగానందరెడ్డి, రామసుబ్బయ్య,భాస్కర్‌రెడ్డి, రామచంద్ర, చంద్రప్ప, దస్తగిరి, చక్కిరప్ప తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు చేసుకున్న రైతులకే పెట్టుబడి సాయం



వ్యవసాయ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఏడీఏ లక్ష్మానాయక్

ధర్మవరం రూరల్: పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం అందుతుందని డీఆర్‌సీ డీడీఏ శ్రీరామ్ నాయక్ పేర్కొన్నారు. గురువారం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌జీఓ కార్యాలయంలో రైతు సేవా కేంద్ర సిబ్బందికి డివిజన్ స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఆర్‌సీ డీడీఏతో పాటు డాట్ సెంటర్ శాస్త్రవేత్త రామసుబ్బయ్య, ఏడీఏ లక్ష్మానాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ, కంది, ఆముదం, పంటలకు చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు, పాటించాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. పంటలో బెట్ట పరిస్థితులు తట్టుకోవడానికి 5 శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని పంటలకు పిచికారీ చేసుకునేలా రైతులకు తెలియజేయాలని రైతు సేవా కేంద్రం సిబ్బంది అవగాహన కల్పించారు. ధర్మవరం డివిజన్ వ్యవసాయ అధికారులు, ఏఈఓలు ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థికి తీవ్రగాయాలు

కదిరి టౌన్: పట్టణంలోని నామాలాడ్జ్ సమీపంలో ఉన్న పాండ వద్ద కారు ఢీకొని విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు..పట్టణంలోని ఆడపాల వీధికి చెందిన రియాజ్ అహ్మద్ కుమారుడు కె.ఎస్.ఎమ్.డి ఫహామ్ ఇంటర్ పూర్తి చేశారు. గురువారం రాత్రి పాండ వద్ద రోడ్డు దాటుతుండగా గోరంట్ల వైపు నుంచి కడపకు వెళ్తున్న కారు ఢీకొంది. ఘటనలో ఫహామ్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు అనంతపురానికి రెఫర్ చేశారు.

ఫ్యాప్టో ధర్నా విజయవంతం చేయండి

ఓడీచెరువు: ఉపాధ్యాయ అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఫ్యాప్టో చైర్మన్ హరిప్రసాద్ రెడ్డి , సెక్రటరీ జనరల్ గౌస్ లాజమ్ కోరారు. గురువారం వర్చువల్‌గా జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఫ్యాప్టో సభ్యులు కోనంకి, అశోక్, షర్ఫోద్దీన్, శ్రీనివాసులు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

ఆలయ నిర్మాణానికి విరాళం



నల్లచెరువు: మండల కేంద్రంలో చౌడేశ్వరి అమ్మవారి ఆలయం నిర్మాణం కోసం మండల కేద్రంలోని ఎల్లమ్మ వీధికి చెందిన జిల్లా చేనేత సంఘం కార్యదర్శి బండి ప్రతాప్ గురువారం విరాళంగా రూ. 5 లక్షలు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి బండి రామచంద్ర జ్ఞాపకార్థం విరాళం అందజేసినట్లు తెలిపారు. మండల చేనేత సంఘం అధ్యక్షుడు అంజనేయులు, అల్లుగుండు చంద్ర. గుత్తి క్రిష్ణ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతం కోసం కృషి చేయండి



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని సన్మానిస్తున్న ఎస్సీసెల్ నేతలు

ధర్మవరం: వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పార్టీ ఎస్సీసెల్ నేతలకు సూచించారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, మడకశిర నియోజకవర్గ వివిధ కమిటీల అధ్యక్షులు, కార్యదర్శులు గురువారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పార్టీ కోసం పనిచేయాలని, ఇందుకు తమ సహకారం ఉంటుందని కేతిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ధర్మవరం ఎస్సీ విభాగం తాలూకా అధ్యక్షుడు నారాయణస్వామి, వైఎస్సార్‌సీపీ దళిత సీనియర్ నాయకులు చౌడప్ప, నరసింహులు, అజంతా కృష్ణ, రమణ, కుమార్, నాగరాజు, మడకశిర యువజన విభాగం అధ్యక్షుడు శేషాద్రి, మండల ఎస్సీసెల్ నాయకులు రంగనాథ్, అశ్వర్థ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి



విద్యార్థులకు హాకీ కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కనగానపల్లి: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో విద్యార్థులకు ఉచితంగా స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తున్నట్లు దాత బంగి పవన్ తెలిపారు. మండలంలోని తగరకుంట జిల్లా పాఠశాల విద్యార్థులకు గురువారం హాకీ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. పాఠశాల పీఈటీ బంగి రాగేష్ సోదరుడైన పవన్ విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నట్లు తెలిపారు. ఈ మధ్యనే స్వదేశానికి వచ్చిన ఆయన ద్వారా క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో స్పోర్ట్స్ కిట్లు ఉచితంగా పంపిణీ చేయించడం జరిగిందన్నారు. విద్యార్థులు సామగ్రిని సద్వినియోగం చేసుకుని మంచి క్రీడాకారులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధవరాజులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సనావుల్లా

నల్లమాడ: రైతులు పంటల సాగుకు ముందు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలని ఏడీఏ సనావుల్లా సూచించారు. భూసార పరీక్షలు, ఎరువుల వాడకంపై స్థానిక మూడో రైతు సేవా కేంద్రంలో గురువారం రైతులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎంత మోతాదులో ఎరువులు వాడాలో తెలియపర్చారు. నానో యూరియా, నానో డీఏపీ అందుబాటులో ఉన్నాయని, ప్రభుత్వం నిర్ణయించిన ధరకే రైతు సేవా కేంద్రాల్లో పంపిణీ చేస్తామన్నారు. ఆగస్టు 15 వరకు కంది పంట సాగుకు అవకాశం ఉందన్నారు. అందుబాటులో ఉన్న ఎరువులను, వాటి ధర తదితర వివరాలను బోర్డుపై వ్రాసి ప్రదర్శించాలని ఎరువుల దుకాణ దారులను ఏడీఏ ఆదేశించారు. ఏఓ అబ్దుల్ హక్ మాట్లాడుతూ మండలంలో ఈ క్రాప్ నమోదు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఏఈఓ వెంకటరంగాచారి, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వేరుశనగ సాగుపై అవగాహన

అమడగూరు: ఆత్మ ఆధ్వర్యంలో గురువారం అమడగూరు వ్యవసాయ కార్యాలయంలో వేరుశనగ సాగులో మెలకువలపై రైతులకు శిక్షణ నిర్వహించారు. ఏఓ వెంకటరమణాచారి వేరుశనగ పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులను రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌కే, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీపీఐ

తాడిమర్రి: పేదల పక్షపాతి సీపీఐ అని ఆ పార్టీ మండల కన్వీనర్ బీసాని లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ధర్మవరంలో సీపీఐ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభమైన జిల్లాస్థాయి మహాసభలకు ఆయన నాయకులు, కార్యకర్తలతో కలసి వెళ్లారు. నాయకులు బీసాని నాగభూషణం, సూర్యనారాయణ, దాసు,వన్నూరు, చౌడప్ప పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ధర్మవరం డివిజన్
7093150088, 7093157766
9912220726, 9912220717